## క్లుప్తంగా

### అంగన్‌వాడీ టీచర్లు సమ్మె విరమించాలి



వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

**సిరిసిల్లటౌన్‌:** అంగన్‌వాడీ టీచర్లు సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం అన్నారు. జిల్లాలోని మినీ అంగన్‌వాడీ టీచర్ల సంఘం ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొనబోమని జిల్లా సంక్షేమాధికారికి వినతి పత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం త్వరలో అంగన్‌వాడీలతో చర్చించేందుకు సిద్ధంగా ఉందని, అంగన్‌వాడీ టీచర్లు సమ్మె విరమించాలన్నారు. సమ్మెలో పాల్గొన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు రిసోర్స్‌ పర్సన్స్‌, వీవోలు, మహిళా స్వశక్తి గ్రూపులతో చర్చించి సమ్మె వెళ్లే స్థానంలో వీరి సేవలను వినియోగించడానికి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు

### సమ్మె పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

**వేములవాడఅర్బన్‌:** వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ల సమ్మె పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ సోమవారం నుంచి జరిగే అంగన్‌వాడీ టీచర్ల నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ల దేవరాజు, శ్రీనివాస్‌, దుర్గయ్య, బాలయ్య పాల్గొన్నారు.

### మేరీ మాటీ.. మేరా దేశ్‌



తడగొండలో మట్టి సేకరిస్తున్న నాయకులు

**బోయినపల్లి:** మండలంలోని తడగొండ గ్రామంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో మేరీ మాటీ.. మేరా దేశ్‌ కింద ఇంటింటికి తిరిగి మట్టి సేకరించారు. ఢిల్లీలో అమరవీరుల స్మృతివనం నిర్మాణంలో భాగంగా దేశంలోని ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించాలని ఆదేశాల మేరకు మట్టిని సేకరిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మినుకుల శ్రీనివాస్‌, రేండ్ల మహిపాల్‌, సింగరి వెంకటేశ్‌ పాల్గొన్నారు.

### సింహగర్జనకు నాయకులు

**సిరిసిల్లఅర్బన్‌:** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగే బీసీల సింహగర్జనకు జిల్లా నుంచి బీసీ శ్రేణులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ బీసీలు రాజకీయ పోరాటం చేసే సమయం ఆసన్నమైందన్నారు. బీసీలు రాజ్యాధికారాన్ని చేపట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బీసీలందరూ ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేష్‌ యాదవ్‌, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోర్డినేటర్‌ కంచర్ల రవిగౌడ్‌, నాయకులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల్లో పుట్టెడు దుఃఖం

• ముంపు గ్రామ ప్రజల ఆవేదన • గ్రామంలో సమస్యల తాండవం • ఇబ్బందిపడుతున్న గ్రామస్తులు • పరిష్కరించాలని వేడుకోలు

**వేములవాడఅర్బన్‌:** "మిడ్‌ మానేరు ముంపులో సర్వం కోల్పోయం. కాని మాకు న్యాయం జరగలేదు. అన్నింటికీ మునిగాం.." అని ముంపు గ్రామమైన గుర్రవానిపల్లి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలో ఉన్న తమ గ్రామాన్ని తీసుకువచ్చి వేములవాడ మండలంలో ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు కొత్తవారు కావడంతో సమస్యలు తీరవు, అధికారులు పట్టించుకోరు అని ఆవేదన చెందుతున్నారు. అప్పటి మిడ్‌ మానేరు కట్ట పనులు నడుస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో మొట్టమొదటగా 2009లో తమ గ్రామానికి నష్టపరిహారం అందించి తమను ఇక్కడికి తరలించారు. మిడ్‌ మానేరు ముంపునకు గురైన గ్రామాలతో పోలిస్తే తమకు అన్నింటిలో ప్యాకేజీతో పాటు పరిహారంలో కూడా తక్కువగా అందించారు. కనీసం గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరితే 13 ఏళ్ల తరువాత కూడా ఇంకా సమస్యలు ఉన్నాయా చూద్దాంలే అంటూ దాట వేస్తున్నారని గ్రామస్తులు అవేదన చెందుతున్నారు.

వేములవాడ మండలం గుర్రవానిపల్లి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ కరీంనగర్‌–సిరిసిల్ల రహదారిని ఆనుకొని 2009 ఏర్పాటు చేశారు. అప్పుడు ఈ కాలనీని మారుపాక గ్రామపంచాయతీ పరిధిగా ఉంచారు. 2018లో గుర్రవానిపల్లి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. ఆనంతరం కాలనీలో కట్టిన



గుర్రవానిపల్లిలో ఇంటి చుట్టూ నిలిచిన నీరు

కమ్యూనిటీ భవనంలోనే గ్రామపంచాయతీ కార్యాలయం నడుస్తోంది. ఇటీవల గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసినా, పనులు మాత్రం ప్రారంభించలేదు.

### గ్రామంలో సమస్యలు..

➡ మురుగు నీటి కాలువల చుటూ పిచ్చిమొక్కలు పెరిగాయి.

➡ అప్పుడు ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీల ప్రారంభంలో అన్ని గ్రామాలకు ప్లాట్‌లలో ప్రభుత్వం మొరం పోసి ప్లాట్‌ను అందించారు. కాని ఇక్కడ ప్లాట్‌లలో మొరం పోయాకపోవడంతో వర్షం నీరు ఇంటి చుట్టూ ఆగుతున్నాయి.

➡ గుట్టపై నుండి వర్షానికి వరదనీరు గ్రామం పక్కన ఉన్న తెట్టకుంటలోకి చేరుతున్నాయి. కుంటనిండి నీరు ఇండ్ల పక్కన అగుతున్నాయి.

➡ సుమారుగా 10 ప్లాట్‌ల వరకు నిర్వాసితులకు తెట్టకుంటలో ఇచ్చారు. అందులో నీరు నిండి ఇళ్లు కట్టుకునే పరిస్థితి లేదు. వాటిని వేరే చోట ఇవ్వాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

➡ గ్రామపంచాయతీలో డబ్బులు లేక పారిశుధ్య సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.

**గుర్రవానిపల్లి గ్రామ ప్రొఫైల్‌**

| | |
|---|---|
| జనాభా | 400 |
| ఓటర్లు | 290 |
| గృహాల సంఖ్య | 110 |

### చేయాల్సిన పనులు..

❒ గ్రామపంచాయతీ భవనం, అన్ని కుల సంఘల భవనాలు, మహిళా సంఘం భవనం, బతుకమ్మ తెప్ప, పోచమ్మ, హనుమాన్‌ ఆలయాలకు ప్రహరీ నిర్మించాలి

❒ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

❒ 18 ఏళ్లు నిండిన యువతకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ అందించాలి.



మురుగు నీటి కాలువను కప్పేసిన పిచ్చి మొక్కలు

### ప్లాట్‌లలో మొరం పోయాలి



గ్రామంలోని ఖాళీ ప్లాట్‌లలో అప్పుడు మొరం పోయాక వర్షం నీరు నిలిచి పక్క ఇళ్ల వాళ్లకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్లాట్‌లలో మొరం పోయించేలా చూడాలి.

– టి. రాంరెడ్డి, గుర్రవానిపల్లి

### జీతాలు చెల్లించాలి



నాలుగు నెలలుగా జీతం రావడం లేదు. జీతం ఇవ్వాలని అడిగితే గ్రామ పంచాయతీలో డబ్బులు లేవు అంటున్నారు. పని చేస్తేనే పొట్ట గడిచేది. జీతం త్వరగా అందించాలి.

– వెంకటేశ్‌, పారిశుధ్య కార్మికుడు, గుర్రవానిపల్లి

### భూమి కబ్జా అవుతోంది



గ్రామపంచాయతీ భూమి చుట్టూ రియల్‌ ప్లాట్లు ఉండటంతో కబ్జాకు గురవుతోంది. గ్రామం చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. హద్దులు ఏర్పాటు చేయాలి.

– కంది రాజిరెడ్డి, గుర్రవానిపల్లి

### అధికారులు పట్టించుకోరు



ఇళ్లని అనుకుని తెట్టకుంట నిండి నీరు ఇళ్ల పక్కన ఆగడంతో ఇబ్బందిగా మారింది. 10 ప్లాట్లు నీటిలోనే ఉన్నాయి. వాటిని మార్చాలని అధికారుల చుట్టూ తిరిగిన కూడా పట్టించుకోవడం లేదు.

– గుర్రం లక్ష్మారెడ్డి, సర్పంచ్‌, గుర్రవానిపల్లి

## చాకలి ఐలమ్మకు నివాళి



ముస్తాబాద్‌: ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



తంగళ్లపల్లి: చిట్యాల ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



ఇల్లంతకుంటలో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి



వేములవాడలో పూలమాల వేస్తున్న తుల ఉమ



బోయినపల్లి: రత్నంపేటలో..



కోనరావుపేట: మామిడిపల్లిలో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆదివారం ఆమె విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భూమి కోసం..భుక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం నాటి తెలంగాణ ప్రజలను ఐక్యం చేసిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచిన ధీర వనిత అని కొనియాడారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ తుల ఉమ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, రజక సంఘం మండల అధ్యక్షులు ర్యాగల్ల అంజయ్య, నారాయణ, ఎంపీపీ పిల్లి రేణుక, పడిగెల మానస, గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, సెస్‌ డైరక్టర్లు, ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సిరిసిల్లఅర్బన్‌/బోయినపల్లి/వేములవాడరూరల్‌/ముస్తాబాద్‌/ఇల్లంతకుంట/వీర్నపల్లి/ముస్తాబాద్‌/వేములవాడ/తంగళ్లపల్లి/కోనరావుపేట/రుద్రంగి

## నియామకం

### గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా పర్శరాములు

**వేములవాడరూరల్‌:** వేములవాడ రూరల్‌ మండలంలోని నూకలమర్రి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలకుర్తి పర్శరాములు, ఉపాధ్యక్షుడిగా నాగుల మహేశ్‌, కోశాధికారిగా నాగుల తిరుపతి, కార్యవర్గసభ్యులుగా గుగ్గిళ్ల నాగరాజు, గుగ్గిళ్ల తిరుపతి, కైర హన్మంతు, పులి లస్మయ్య, గుండ లింగయ్య, కైర గణేశ్‌ ఎన్నికయ్యారు. వీరిని గౌడ సంఘం సభ్యులు, గ్రామ నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు.

### ముస్తాబాద్‌ కార్యవర్గం

**ముస్తాబాద్‌:** మండలంలోని చీకోడు గౌడ సంఘం అధ్యక్షుడిగా గున్నాల గణేశ్‌గౌడ్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా గణేశ్‌గౌడ్‌, ఉపాధ్యక్షుడిగా వెంకటరాములుగౌడ్‌ ఎన్నికయ్యారు.

### పీహెచ్‌డీ అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానిస్తున్న వెలమ సంక్షేమ సంఘం నాయకులు

**బోయినపల్లి:** పీహెచ్‌డీ డాక్టరేట్‌ అవార్డు పొందిన మండలంలోని వరదవెల్లి గ్రామానికి చెందిన డాక్టర్‌ పీచర వేణుగోపాల్‌రావు, డాక్టర్‌ పీచర రవీందర్‌రావును గ్రామంలోని పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు పీచర దామోదర్‌రావు, పీచర సంపత్‌రావు, పీచర నరేందర్‌రావు, వేణుగోపాల్‌రావు, విష్ణుప్రసాద్‌రావు, రఘునందన్‌రావు, బొమ్మెన రామ్‌గోపాల్‌రావు, పీచర రవీందర్‌రావు, మదూకర్‌రావు, శ్రీనివాసరావు, మాధవరావు పాల్గొన్నారు.

### హోంగార్డు కుటుంబాన్ని ఆదుకోవాలి



పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ముస్తాబాద్‌:** హైదరాబాద్‌లో మృతి చెందిన హోంగార్డు రవీందర్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన హోంగార్డు రవీందర్‌ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం అందజేయాలన్నారు. ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో 18 వేల మంది హోంగార్డులు పనిచేస్తున్నారని, వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్‌ చేయాలన్నారు. హోంగార్డు మృతికి కారణమైన వారిని చట్టపరంగా శిక్షించాలన్నారు. యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బానోతు రాజునాయక్‌, పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు, బీసీ సెల్‌ అధ్యక్షుడు అనవేని రవి, శ్రీనివాస్‌, రాథోడ్‌, ప్రశాంత్‌, మూన్‌ సింగ్‌, తిరుపతి తదితరులు పాల్గొన్నార

### అపూర్వ సమ్మేళనం



**వేములవాడ:** వేములవాడ పట్టణంలోని ఉజ్వల ఉన్నత పాఠశాలలో 2007–08 టెన్త్‌ బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ అరుణాద్రి, డైరెక్టర్‌ పంజాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పొలాస నాగేందర్‌, కుమారస్వామి, శంకర్‌, శాంత, శ్రీదేవి, జ్యోతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ పార్టీ జెండా పండుగ



నర్సింహులపల్లెలో కాంగ్రెస్‌లో చేరిన గ్రామస్తులు



విలాసాగర్‌ గ్రామంలో పర్యటిస్తున్న మేడిపల్లి సత్యం

**తంగళ్లపల్లి:** కాంగ్రెస్‌ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలంలోని నర్సింహులపల్లె, రామన్నపల్లె గ్రామాల్లో కాంగ్రెస్‌ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ జెండాను కేకే ఆవిష్కరించగా రెండు గ్రామాల్లో కేకే సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు సూర దేవరాజు, మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్‌ టోని, జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల భూపతి, గుగ్గిళ్ల శ్రీకాంత్‌ గౌడ్‌, రాజు, బాలు పాల్గొన్నారు.

**రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ**

**బోయినపల్లి:** రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని కాంగ్రెస్‌ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. వస్తున్నా మీ సేవకైలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని విలాసాగర్‌ గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్‌ పల్లె పల్లెకు సత్యమన్న కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రూ.500లకే సిలిండర్‌, ఉచిత బస్‌ ప్రయాణ సౌకర్యం కలిపిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, గిరిజనులకు, యువతకు ప్రత్యేక పథకాలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనుకయ్య, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్‌, నాయకులు పాల్గొన్నారు.

### మల్కపేట రిజర్వాయర్‌కు కర్రోల్ల నర్సయ్య పేరుపెట్టాలి

**సిరిసిల్లఅర్బన్‌:** మల్కపేట రిజర్వాయర్‌కి మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలని అఖిల పక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం అఖిల పక్షం పార్టీల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1957 నుంచి 1967 వరకు ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించి, ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడిన కర్రోల నర్సయ్య పేరు మల్కపేట రిజర్వాయర్‌కి పెట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు ఎలగందుల వెంకన్న, అంకనిభాను, ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆవునూరి ప్రభాకర్‌, బీఎస్పీ నాయకులు రాంచద్రం, వర్దవెల్లి స్వామిగౌడ్‌, సీపీఐ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్‌, చిట్టాల మధు, కాంగ్రెస్‌ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌, నాయిని ప్రభాకర్‌, ఫిరోజ్‌ పాషా, ప్రకాశ్‌ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అఖిల పక్షం నాయకులు

### ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేయాలి

**సిరిసిల్లఅర్బన్‌:** రాష్ట్రంలో ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులను రెగ్యూలరైజ్‌ చేయాలని ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగుల జెఏసీ అడ్‌హాక్‌ కమిటీ అధ్యక్షుడు రాంచంద్రం ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని అన్ని శాఖల ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగుల జెఏసీ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు సందీప్‌, లింగంనాయక్‌, యాదగిరి, భాను, శేఖర్‌, భాస్కర్‌, సదానందం, రాణి, ప్రియాంక, అరుణ్‌,హరీష్‌, సాగర్‌ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**పూర్వ విద్యార్థుల సాయం**



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**ముస్తాబాద్‌:** ఎల్లారెడ్డిపేట మేజర్‌ పంచాయతీ ట్రాక్టర్‌ డ్రైవర్‌ రేసు బాబు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బండలింగంపల్లి జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.16 వేల నగదును ఆదివారం అందజేశారు. మానవతావాదులు స్పందించి మృతుని కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గొల్లపల్లి సురేశ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

**జూట్‌ బ్యాగుల వితరణ**

**బోయినపల్లి:** బోయినపల్లి రేషన్‌ షాపు డీలర్‌ పాత్తూరి సురేశ్‌బాబు ఆదివారం రేషన్‌ వినియోగదారులకు తన తండ్రి డీలర్‌ రాజయ్య జ్ఞాపకార్థం జూట్‌ బ్యాగులు వితరణగా అందించారు.

**ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం**

**సిరిసిల్లఅర్బన్‌:** తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్‌ కేర్‌ సెంటర్‌ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఆదివారం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళ ప్రారంభించారు.

**కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ**

**సిరిసిల్లఅర్బన్‌:** సిరిసిల్ల మున్సిపల్‌ పరిధి 9వ వార్డు పెద్దూరులో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆదివారం కౌన్సిలర్‌ లింగంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు.

**ఆర్థికసాయం**

**చందుర్తి:** గడ్డి కట్టింగ్‌ మిషన్‌లో పడి చేతిని కోల్పోయిన మండలంలోని కిష్టంపేట గ్రామానికి ఉగిలే జలెందర్‌ కుటుంబసభ్యులకు కాంగ్రెస్‌ పార్టీ పక్షాన డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు.

**బుగ్గ రామన్నకు పూజలు**

**వీర్నపల్లి:** మండలం రంగంపేటలోని బుగ్గ రామన్న ఆలయంలో సర్పంచ్‌ నందగిరి లింగం ఆధ్వర్యంలో ఆదివారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

**పరామర్శ**

**రుద్రంగి:** అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన దయ్యాల పెద్ద నర్సయ్యను డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ ఆదివారం పరామర్శించారు. డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం పాల్గొన్నారు.